● నాస్టాల్జియా

మా ఊరి ముచ్చట




# గణపతి పందిరి - నవమి సందడి

**పచ్చని పంట పొలాలతో, పైరగాలి పలకరింపులతో, నిండుగా ప్రవహించే కాలువలతో కళకళలాడే పశ్చిమగోదావరి జిల్లా 'భీమడోలు' మా ఊరు.**

ఊరి పక్కనే రైల్వేస్టేషన్, దానికి ఆనుకొని జాతీయ రహదారి, దానికి ఆనుకొని గోదారి కాలువ.. ఆ కాలువ కింద పంట పొలాలు... పై నుంచి చూస్తే పచ్చని చీరకు మూడంచుల పవిట కప్పినట్టు ఉంటుంది మా ఊరు.

మా నాన్నగారిది పోలీసు ఉద్యోగం. మేముండేదీ, నేను పుట్టిందీ.. పోలీసు లైన్‌లోనే. ఆ రోజుల్లో పోలీసులైన్ అంటే ఇప్పటిలా అపార్ట్‌మెంట్స్‌లా కాకుండా, ఒక ఇంటికి ఒక ఇల్లు ఆనుకొని, రైలు పెట్టెల్లా ఉండేవి. ఎదురుగా పోలీసులు డ్రిల్ చేసుకునేందుకు పెద్ద గ్రౌండ్, దానికి ముందు పోలీస్ స్టేషన్, దాని పక్కనే రామాలయం, ఆనుకొని దేవుడి చెరువు ఉండేవి. ఆ చెరువులోని నీటినే ఊరంతా తాగేవారు. గోదావరి కాలువకు వెళ్లాలంటే రైల్వేట్రాక్, రోడ్డుదాటి వెళ్లాలి. అందుకని మరో చిన్నకాలువ ద్వారా దేవుడి చెరువులోకి నీరు చేరే ఏర్పాటు చేశారు. ఆ చెరువులో స్నానాలు, బట్టలు ఉతకటం లాంటివి నిషేధం.

ప్రతి ఉదయం, సాయంత్రం, చిన్నా పెద్దా తేడా లేకుండా ఆడవారు బిందెలతో, మగవారు కావిళ్లతో నీళ్లు మోస్తూ దినచర్యలు ప్రారంభించేవారు. అప్పుడప్పుడూ మా ఊరికి వరదలు వస్తూండేవి. పోలీసులైన్, గ్రౌండ్‌తోసహా మోకాలి లోతు నీటిలో మునిగిపోయేవి. ఇంటిలోని సామాన్లు, మంచాలు, బల్లలపై పెట్టుకుని వరదలు తగ్గేవరకూ కాలక్షేపం చేయాల్సివచ్చేది. అంతకన్నా ముందు పెద్ద వరదలు వచ్చినప్పుడు రైల్వేవారు కొన్ని ఖాళీ రైలు పెట్టెలను ఏర్పాటు చేసేవారని మా పెద్దలు చెపుతుంటారు.

ఇంటికి దగ్గరలోనే రైల్వేస్టేషన్, దాని పక్కనే రైల్వే క్వార్టర్స్‌లోని ఫ్రెండ్స్... ఇక మా ఆట పాటలన్నీ రైల్వేస్టేషన్‌లోనే సాగేవి. రైలు వచ్చేముందు పట్టాలపై పిన్నీసులు, గోల్డు స్పాట్ మూతలు, అయిదు, పదిపైసల బిళ్లలు పెట్టి, రైలు వాటిపైనుండి వెళ్లాక వాటి ఆకారాలు చూసి ఆశ్చర్యపోవటం మా సరదాలు.

ఇక వినాయక చవితి, శ్రీరామనవమి వస్తున్నాయంటే మా ఆనందం అవధులు దాటేది. ఆ పది రాత్రులూ పోలీసు గ్రౌండ్స్‌లో పెద్ద స్టేజి కట్టించి, హరికథ, బుర్రకథ, నాటకాలు, రికార్డింగ్ డ్యాన్సులు, తెర కట్టి సినిమాలు వేసేవారు. ఏ రోజు ఏ ప్రోగ్రామో తెలిపే కరపత్రాలు కూడా పంచేవారు. రాత్రి ప్రోగ్రాములు మొదలయ్యేలోపు గ్రౌండంతా పిల్లల అల్లరి, ఆటలు, పాటలతో కోలాహలంగా ఉండేది. ముఖ్యంగా చెరువు గట్టుపై ఉండే 'దూలగుండాకు' తీసి ఒడుపుగా పట్టుకొని, అవతలి వారికి తెలియకుండా రాసి పారిపోయేవాళ్లం. ఒక్కోసారి ఇది రివర్స్ అయ్యి మా దురద కూడా తీరేది.

మా అమ్మ నా చిన్నతనంలోనే చనిపోవటం, అన్నలు వృత్తిరీత్యా వేరే ఊరిలో ఉండటం, కుటుంబంలో నేనే ఆఖరువాడిని అవ్వటం వల్ల కొంత అదుపు తప్పి అల్లరిగా తిరగడం జరిగింది. అది చూసి నాన్నగారి సహోద్యోగి అయిన కానిస్టేబుల్ బేగ్‌గారు, ''నీకా తల్లిలేదు. మీ నాన్న ఆస్తి ఏమీ సంపాదించలేదు, మా పిల్లలు ఎలాగోలా బతుకుతారు, నువ్వు మాత్రం బాగా చదువుకొని పైకి రావాలి'' అన్న మందలింపు మాటలు, పరాయి పిల్లల బాగోగులు కూడా పట్టించుకునే పెద్దరికం ఇప్పటికీ నన్ను కదిలిస్తుంది. ఇది ఒక్క పల్లెటూరులోనే సాధ్యం.

'నా ఆటోగ్రాఫ్ స్వీట్ మెమొరీస్' లోలాగా నాకూ కొన్ని శాడ్ మెమొరీస్ ఉన్నాయి మా ఊరిలో.. ఒకటి మా అమ్మ చనిపోవటం, రెండు నా మిత్రుడి మురళీ మరణం. ఆ రోజు సాయంత్రం రైల్వేలో గ్యాంగ్‌మెన్‌గా పనిచేసే మురళీ నాన్నగారు, వాళ్ల అన్నయ్య ముఖర్జీ, ప్రతి ఇంటికీ వెళ్లి ''మా మురళీ కనిపించాడా?'' అని అడగటం ఇప్పటికీ నాకు గుర్తుంది. రాత్రంతా ఆందోళన.. తెల్లారింది. ఇంకేముంది. వాళ్ల ఇంటి దగ్గర్లోనే ఉన్న మోకాలి లోతు కొలనులో మురళీ పడి చనిపోయాడని వార్త. ఎలా, ఎందుకు! వచ్చే పోయే జనం..! మురళీ మంచి ఈతగాడే కానీ వాడికి అప్పుడప్పుడు ఫిట్స్ వచ్చేదట. ఎండలో చేపలు పడుతుండగా ఫిట్సు వచ్చి నీటిలో పడిపోయి చనిపోయాడు. 'ఊట బావిలో మిత్రుడి మరణం- ఏకధాటిగా ఏడ్చిన తరుణం' పాట విన్నప్పుడల్లా మురళీ మదిలో మెదులుతుంటాడు.

మా ఊరి చుట్టుపక్కల సుద్దగనులున్నాయి. సుద్దను పింగాణి జాడీల తయారీకి ఉపయోగిస్తారు. మా ఊరిలోనే నాలుగైదు జాడీ ఫ్యాక్టరీలు ఉన్నాయి. ఆ సుద్దను దూర ప్రాంతాలకు తరలించేందుకు లారీల్లో తెచ్చి రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారమ్‌పై గుట్టలుగా పోసేవారు. తరువాత గూడ్స్ వ్యాగన్స్‌లో లోడింగ్ చేసేవారు. కొన్ని రోజులు, నెలల పాటు గూడ్స్ వ్యాగన్లు అక్కడే నిలిచి ఉండేవి. ఆ సుద్ద ముక్కలతో వ్యాగన్స్‌పై బొమ్మలు వేయడం నా హాబీగా మారింది. కొలనులో తామరపూలు, చెట్లు, జంతువులు, దేవుళ్ల బొమ్మలు.. యుగంధర్ సినిమాలోని ఎన్.టి.ఆర్. బొమ్మ.. ఇలా ఏది మదిలో మెదిలితే అది చేసేవాడిని. ఆ విధంగా చిన్నప్పటినుండే ఆర్టిస్టుగా నాకోగుర్తింపు ఇచ్చింది మా ఊరు.

ఏదేమైనా ఉన్నత చదువులకోసమో, తల్లిదండ్రుల ఉద్యోగ బదిలీల మూలంగానో, వృత్తి, ఉపాధికోసమో ఎంత దూరప్రాంతాలకు వెళ్లిపోయినా.. ఒక్కసారి పుట్టి పెరిగిన ఊరు, బాల్యం గుర్తుకురాగానే మనసు పులకిస్తుంది. ఆ ఊర్లో మనవారంటూ ఉన్నా లేకున్నా వెళ్లి మనం మొదటిసారి కాలుపెట్టిన మట్టిని మరోసారి ముట్టుకోవాలనిపిస్తుంది.

- సూర్య